క్లుప్తంగా

పెద్ద చింతరేవులలో ఉడిపి పీఠాధిపతి



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఉడిపి పీఠాధిపతి పలిమారు మఠం 1008 విద్యాధీశ తీర్థ శ్రీపాదుల స్వామి సందర్శించారు. ఈసందర్భంగా ఆయలంలో స్వామిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ ధర్మకర్త, ఆలయ కమిటీ సభ్యులు స్వామిజీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులను స్వామీజీ ఆశీర్వచనం చేశారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు.

ఘనంగా చౌడేశ్వరీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన



మానవపాడు: మండలంలోని జల్లాపరంలో బుధవారం చౌడేశ్వరీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, శేషిరెడ్డి, కరుణసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ





అయిజ: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లేష్, ఉలిగమ్మ దంపతుల కుమారుడు కె.వీరేష్ నీట్‌లో మొదటి ప్రయత్నంలోనే 604 మార్కులు సాధించి ఎంబీబీఎస్‌లో సీటుకు అర్హత సాధించాడు. గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి వీరేషను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గట్టు: మండలంలోని రాయాపురం గ్రామానికి చెందిన గొల్ల రాముడు కుమార్తె మానస వీణ నీట్ ఫలితాల్లో 467/720 మార్కులను సాధించింది. అదేవిధంగా మాచర్ల గ్రామంలో గ్రామీణ వైద్యునిగా పని చేస్తున్న ప్రతాప్‌గౌడ్ కుమారుడు అరవింద్‌గౌడు నీట్‌లో 527/720 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటుకు అర్హత పొందాడు. ఈ సందర్భంగా వారిని ఆయా గ్రామస్తులు అభినందించారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



గట్టు: మండలంలోని మాచర్లలో కంటి వెలుగు శిబిరం కొనసాగుతోంది. బుధవారం గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో మొత్తం 146 మందికి కంటి పరీక్షలు, ఐదుగురికి అద్దాలను పంపిణీ చేశారు. ఏడుగురికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు సీహెచ్‌ఓ ఊసేని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయికిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

మల్దకల్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో నాటిన మొక్కలకు ట్రీగార్డులను ఏర్పాటు చేసి మొక్కల పాదుకల వద్ద ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అయిజ: మండలంలోని పులికల్ గ్రామ సమీపంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ బుధవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం పులికల్ గ్రామ సమీపంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. పోలీసుల తనిఖీలో ఇసుక ట్రాక్టర్ పట్టుబడిందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈ-పంచాయతీ సేవలు అందేనా?

- నిరుపయోగంగా కంప్యూటర్లు
- పట్టించుకోని అధికారులు



చెన్నిపాడులో నిరుపయోగంగా కంప్యూటర్లు



పెద్దపోతులపాడు పంచాయతీ కార్యాలయం

మానవపాడు: గ్రామ పంచాయతీల ద్వారా పౌర సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ-పంచాయతీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో కాగిత రహిత సేవలు అందించేందుకు, ప్రజలకు చేరువయ్యేందుకు ఈ - పంచాయతీ సేవలకు శ్రీకారం చుట్టింది. గ్రామీణులు ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లకుండా గ్రామాల్లోను నాణ్యమైన ఆన్‌లైన్ సేవలు వినియోగించేలా చర్యలు చేపట్టింది. కాని అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఈ- పంచాయతీల ద్వారా జనన, మరణ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలు, జీపీకి వచ్చే ఆదాయం, ఇంటి నిర్మాణ అనుమతులు, ఇంటిపన్నులు, ఇతర వివరాలను ఆన్‌లైన్ నమోదు చేస్తే సమయం ఆదాతో పాటు పక్కా సమాచారం నిక్షిప్తం అవుతోంది. కార్యదర్శులకు కూడా పనిభారం తగ్గుతోంది. ప్రస్తుతం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రతి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ పంచాయతీ సేవలు అందుబాటులోకి వస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

ఇంటర్‌నెట్ సౌకర్యం లేక..

గ్రామీణులకు స్థానికంగా పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్లను సమకూర్చింది. ఇంటర్‌నెట్ సౌకర్యం లేక ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలతో పాటు పంచాయతీ కార్యదర్శులకు సైతం తిప్పలు తప్పడం లేదు. కంప్యూటర్లు ఉన్నా ఇంటర్‌నెట్ లేని కారణంగా ప్రతి పనికి ఆన్‌లైన్ నమోదు కోసం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఈ - పంచాయతీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పారదర్శకత పాలన అందించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

16 జీపీల్లో కంప్యూటర్లు...

మండలంలోని 16 గ్రామ పంచాయతీలు ఉండగా 2016లో రాష్ట్ర ప్రభుత్వం ఈ-పాలనకు సంబంధించి 16 గ్రామ పంచాయతీలకు కంప్యూటర్లును పంపిణీ చేసింది. పాలనలో పారదర్శకత, పనుల్లో వేగం పెంచాలనేది ఈ-పాలన ఉద్దేశ్యం. కాని గతంలో అనేకసార్లు గ్రామ పంచాయతీలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నలు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మిషన్ భగీరథ పనుల్లో భాగంగా పైప్‌లైన్ విస్తరణ చేపట్టగా తవ్వకాల్లో చాలా చోట్ల కేబుల్ తీగలు తెగిపోయాయి. టీ-ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించేందుకు రెండేళ్ల కిందట పనులు ప్రారంభించింది. కానీ ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో ఇంటర్‌నెట్ సైకర్యం లేదు. గ్రామ పంచాయతీల ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

ఆన్‌లైన్ సేవలు అందించాలి



గ్రామ పంచాయతీలో ఆన్‌లైన్ సేవలు అందించాలి. కుల, ఆదాయ, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం మండల కేంద్రానికి వెళ్తున్నాం. మండల కేంద్రం 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. పంచాయతీల్లో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి.

– కృష్ణయ్యనాయుడు, చండూరు

ఇంటర్‌నెట్ సౌకర్యం లేదు

గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవం. ఇంటర్‌నెట్ సౌకర్యం లేదు. ప్రస్తుతం మండల కేంద్రం నుంచే ఈ- పంచాయతీ సేవలు అందిస్తున్నాం. టీ-ఫైబర్ ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి వస్తే గ్రామ పంచాయతీల ద్వారా సేవలు అందుబాటులోకి వస్తాయి.

– ఎంపీడీఓ రమణరావు, మానవపాడు

సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరభ్యాసం చేయిస్తున్న డీఈఓ సిరాజుద్దీన్ తదితరులు

ధరూరు: మండల కేంద్రంలోని హరిజన్ చెర్రి ప్రాథమిక పాఠశాలలో డీఈఓ సిరాజుద్దీన్ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. బుధవారం జిల్లా సమన్వయ అధికారి హంపయ్యతో కలిసి పాఠశాలను ఆయన సందర్శించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడారు. బాగా చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బీజేపీతోనే పారదర్శక పాలన



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

శాంతినగర్: బీజేపీతోనే పారదర్శక పాలన సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ కన్యకాపరమేశ్వరీ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ సంయుక్త మోర్చా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన దేశ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడిందన్నారు. కరోనా కారణంగా ప్రజలకు ఉచితంగా బియ్యాన్ని సరఫరా చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుందన్నారు. దేశంలో ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రోజుకు 32 కిలోమీటర్లు జాతీయ రహదారులు వేస్తున్నారని వివరించారు. వందే భారత్ రైళ్లు, విమానాశ్రయాలు రెట్టింపయ్యావన్నారు. ఉజ్వల పథకం కింద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారన్నారు. కార్యకర్తలు గడప గడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. కరెంట్, బస్ చార్జీలు, లిక్కర్, భూ రిజిస్ట్రేషన్‌లు ధరలు పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట



అలంపూర్ పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి



మానవపాడులో..

అలంపూర్ రూరల్: మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండల వైద్యాధికారి ప్రసూన రాణి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, సర్పంచ్ లలితమ్మ అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు, పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి మంగళవారం కేవలం మహిళల కోసమే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్య మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిజ్వాన తాన్విర్ మహిళలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. మహిళలకు రక్తహీనత లేకుండా తీసుకోవాల్సి జాగ్రత్తల గరించి వివరించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ హైమావతి, ఏఎన్‌ఎంలు తదితరుల పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యం

గద్వాల క్రైం: రక్తదానంలో చేస్తే ఆరోగ్యంగా ఉంటారని రోగాలు దరిచేరవని వైద్యుడు నవీన్‌క్రాంతి అన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి ప్రాణావాయువు ఎంత అవసరమో రక్తం కూడా అంతే అవసరమన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. గర్భిణులు, చిన్నారులు, వయోవృద్ధులు రక్తహీనతతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. యువకులు స్వచ్ఛందగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. అనంతరం జిల్లాలోని యువత, యువజన సంఘల నాయకులు, వైద్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, నరేష్ తదితరులు ఉన్నారు.

ప్రశంసాపత్రాల అందజేత

అయిజ: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మండలంలోని సంకాపురంలో బీఆర్ఎస్ నాయకుడు దివంగత తిరుమలరెడ్డి జయంతి పురస్కరించుకొని సంకాపురం రాముడు రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి 680 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. అదేవిధంగా అయిజ పట్టణానికి చెందిన భీమేశ్వర్ రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు భీమేశ్వర్‌రెడ్డి ఇప్పటి వరకు 41 సార్లు రక్తదానం చేసి జోగుళాంబ గద్వాల జిల్లాలోనే ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్ (సంస్కృతి భవన్)లో వారికి గవర్నర్ తమిళిసై సౌందరాజన్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జోగుళాంబ గద్వాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ తాహేర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



మానవపాడు: మండలంలోని ఏ.బుర్దిపాడులో బుధవారం లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీఎం అబ్రహం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ధ్వజస్తంభ ప్రతిష్ఠను తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ విరూపాక్షరెడ్డి, ఎంపీటీసీ భారత్‌సింహారెడ్డి, వడ్డేపల్లి జెడ్పీటీసీ కళాపోగు రాజు, జక్కిరెడ్డిపల్లి రవిరెడ్డి, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీసేవా కేంద్రాలు కిటకిట



కేటీదొడ్డి: కులవృత్తుల వారికి ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం అందించనుంది. దీంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దరఖాస్తుల దారులు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు క్యూ కట్టారు. గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆన్‌లైన్ చేసుకున్న వారికి తహసీల్దార్ సుందర్ రాజు ఎప్పటికప్పుడు సంతకాలు చేసి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులో లేకపోవడంతో దరఖాస్తుదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

మాజీ ఎమ్మెల్సీకి సన్మానం

గద్వాల రూరల్: మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రారావును గద్వాల బార్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. బుధవారం రాంచంద్రారావు పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా కేంద్రానికి వచ్చారు. దీంతో న్యాయవాదులు ఆయనను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదిమల్లారెడ్డి, సీనియర్ న్యాయవాదులు వెంకటాద్రిరెడ్డి, శ్రీధర్, జయసింహారెడ్డి, రాంబాబు, వెంకటేష్, శ్రీకాంత్, పటేల్ శేషు, మన్సూర్, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

రైతన్న బిజీబిజీ



ధరూరు: అడపా దడపా కురుస్తున్న వర్షాలతో మెట్ట పంట సాగు పనులు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షంతో మెట్ట పొలాల్లో ఆముదం, కంది వంటి విత్తనాలు వేసేందుకు పంట పొలాల పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. ధరూరు, పారుచర్ల, మన్నాపురం, జాంపల్లి తదితర గ్రామాల్లో రెండు రోజులుగా రైతులు పంట పొలాల్లో బిజీ బిజీగా కనిపిస్తున్నారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న బండారి భాస్కర్

ఎర్రవల్లిచౌరస్తా: క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని షేకుపల్లిలో ఎంపీపీ స్నేహ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హనుమంతురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, రాందేవ్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాతా బృందం

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడులో హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, పోలీసు కళాజాతా బృందం సభ్యులు బుధవారం సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనం నడపొద్దన్నారు. బాల్య వివాహాలు చేయొద్దని, బాలకార్మికులను పనుల్లో పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కేశవరావు, షీ టీం సభ్యులు, భరోసా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

తెగులుతో పత్తి రైతులకు నష్టం



పత్తి మొక్కలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

గట్టు: ఎర్ర తెగులు కారణంగా పత్తి రైతులు నష్టాల పాలయ్యారని, సీడ్ పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహా డిమాండ్ చేశారు. బుధవారం బోయలగూడెం, ఇందువాసి గ్రామాల్లో ఆయన పర్యటించి, సీడ్ పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్ర తెగులు సోకిన కారణంగా సీడ్ పత్తి మొక్కలను తొలగిస్తున్నారన్నారు. సీడ్ పత్తి రైతులు పంట సాగు కోసం లక్షల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీమా సౌకర్యం కల్పించడంతో ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. ఆయా గ్రామాల్లో 500 ఎకరాల్లో సీడ్ పత్తి పంటలు దెబ్బతిన్నాయన్నారు. సీడ్ పత్తి రైతులతో పాటుగా కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు తిమ్మోతి, రాజు, తిమ్మప్ప, ఎలిషా, బీమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కూలీలు

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు వెంటనే కూలి చెల్లించాలని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహా డిమాండ్ చేశారు. బుధవారం ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు వారి కూలి రూ. 600 చెల్లించాలని, గతంలో పనులు చేసిన వాటికి చాలా మందికి కూలి డబ్బులు చెల్లించలేదని ఆరోపించారు. అనంతరం ఎంపీడీఓ చెన్నయ్య, ఏపీఓ రామలింగేశ్వర ప్రసాద్‌కు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తిమ్మప్ప, కూలీలు శంకరమ్మ, నీలమ్మ, రాధమ్మ, తిమ్మక్క, నర్సింహులు, తాయప్ప, జంగిలప్ప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



ప్రహరీ లేని ప్రాథమిక పాఠశాల భవనం

మల్దకల్: మండలంలోని ఎద్దులగూడెం ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు నర్సింహులు, వెంకటన్న కోరారు. మండల కేంద్రం నుంచి ఎల్కూరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన పాఠశాల భవనం ఉండటంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అటవీ భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న అధికారులు

గట్టు: మండలంలోని చమన్‌ఖాన్‌దొడ్డి అటవీ భూములను బుధవారం ఎంపీడీఓ చెన్నయ్య. అటవీశాఖ అధికారి రాఘవేంద్ర, ఏపీఓ రామలింగేశ్వరప్రసాద్, ఈసీ రామకృష్ణలు పరిశీలించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవంలో మొక్కలను నాటేందుకుగాను ప్రస్తుతం గుంతలను తవ్వే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పనులు వారు పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అధిక సంఖ్యలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని వారు పేర్కొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రారావు

గద్వాల: తెలంగాణ అవతరణ దినోత్సవం పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రారావు అన్నారు. బువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పూర్వ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ మోసపూరితమైన హామీలు ఇచ్చి ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దొరల పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. దశాబ్ది ఉత్సవాలను బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమంగా నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తను సిద్ధం చేయాలని, బూత్‌స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అప్సర్‌పాషా, గడ్డం కృష్ణారెడ్డి, డీకే స్నిగ్ధారెడ్డి, రవికుమార్, రామాంజనేయులు, పాల్వాయి రాములు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

శాంతినగర్: కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమలి ఆంజనేయులు అన్నారు. బుధవారం వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్‌లో బీజేపీ దళితమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదన్న ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీ బలమన్నారు. తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, బంగి లక్ష్మణ్, బలరాంరెడ్డి, తిరుమల్, మధుసూదన్‌గౌడ్, కేకే రెడ్డి, నాగమల్లయ్య, వెంకటేష్‌యాదవ్, జగదీష్‌గౌడ్, శేఖర్, రామకృష్ణనాయుడు, నరసింహయ్య శెట్టి, ప్రదీప్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఉర్దూ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ శివప్రసాద్

మానవపాడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలకు ఎంత మంది హాజరయ్యారని తరగతి గదుల్లోకి వెళ్లి పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జఫురుల్లా, నిజామ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.